కథ

# పండగొచ్చింది

- గోగినేని మణి, 94907 53335



పద్మజను చూస్తూంటే ప్రభావతి ఎదురొచ్చి "ఈ మధ్యలో కనిపించనే లేదు. ఆఫీసులో పని ఎక్కువగా ఉంటోందా?" అని అడిగింది.

"వద్దామనుకుంటూనే ఆఫీసులో ఆలస్యం అవుతుండే సరికి ఇంటికెళ్ళిపోతున్నా" అంటూ అటూ ఇటూ చూసి "రమ్య ఇంట్లోనే ఉందా? కనిపించదేం?" అంది.

ప్రభావతి గట్టిగా నిట్టూర్చింది. "ఏమిటో పేరుకి ఇంట్లో ఉంటుందన్నమాటే గానీ, ఉన్నట్లుగా ఉండటం లేదు. తన గదిలోనే పొద్దు పుచ్చుతోంది. ఏం చేయాలో తోచడం లేదనుకో,, ! రమ్య ఇష్టపడిందనే కదూ.. మన అంతస్తుకు సరితూగరని తెలిసినా నాలుగు మెట్లు దిగి పెళ్ళి చేస్తే వాళ్ళేమో మర్యాదలు సరిగా లేవని చిన్నచూపు చూశారంటూ గొడవ పెట్టుకున్నారు. పెళ్ళిళ్ళలో ఇలాంటివి మామూలేనని సరిపెట్టుకున్నాం. వాళ్ళింకా బెట్టు చేస్తూ గొడవ పెద్దది చేస్తున్నారు. నాకైతే ఎవరికి ఏం చెప్పాలో తెలియటం లేదు! కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపంలా ఉంది నా పరిస్థితి!"

"నేను రమ్యతో మాట్లాడుతానుండు" అంటూ అటువైపు అడుగు వేస్తున్న పద్మజను ఆపి ప్రభావతి గొంతు తగ్గించి మెల్లగా అంది "ఇందాకనే ఎదురింటావిడ వచ్చి వెళ్ళింది. ఆవిడ బంధువుల బంధువులెవరో రమ్య అత్తగారింటి పక్కనే ఉంటారట. రమ్య అత్తగారు వాళ్ళబ్బాయి విడాకులు తీసుకుని మళ్ళీ పెళ్ళి చేస్తామని అందరితో చెబుతోందట. ఆ మాట మాతో ఈవిడ చెప్పేసరికి రమ్య ఇంకా మనసు పాడుచేసుకుని గదిలో ముడుచుకు కూర్చుంది. ఆ అబ్బాయేమో తన వాళ్ళ వాదనే కరెక్టనుకుంటున్నట్లుగా ఉన్నాడు. రమ్యతో ఫోనులో అయినా మాట్లాడుతున్నట్లుగా లేదు. అలాంటప్పుడు మనమే ఎందుకిలా బాధపడటం? ఈ రోజుల్లో విడాకులనేవి మామూలైపోయాయి. ఎవరూ తప్పుగా అనుకోవటం లేదు. నీ సంగతే చూడు. అత్తింటి ఆరళ్ళ నుండి ధైర్యంగా బయటపడ్డావు. ఉద్యోగం చేసుకుంటూ చక్కగా నీ బతుకు నువ్వు బతుకుతున్నావ్! అవునా? అందుకని పద్మా..! వాళ్ళు అడిగేవరకు ఆగకుండా ముందుగా మనమే ఆ విడాకులేవో ఇచ్చేసి మనకు తగ్గ మంచి సంబంధాన్ని చూసి రమ్యకు పెళ్ళి చేసేస్తే బావుంటుందనిపిస్తోంది నాకు! రమ్యకి నీ మాటంటే గురి! నువ్వే ఎలాగైనా మెల్లగా నచ్చచెప్పి ఒప్పించు.. ఏమంటావ్ పద్మా?"

"అలాగే... మాట్లాడతాలే వదినా" అంటూ పద్మజ రమ్య గదిలోకి వెళ్ళింది.

కంప్యూటర్ ముందు ఏదో ఆలోచిస్తున్నట్లుగా కూర్చున్న రమ్య ఎదురుగా నిలబడిన పద్మజ రెండు క్షణాల తర్వాత "ఏమిటీ రమ్యా.. అంత పరధ్యానం? ఎవరొచ్చిందీ కూడా గమనించకుండా ఏం ఆలోచిస్తున్నావ్..?" అనడిగింది.

ఉలిక్కిపడిన రమ్య ... "అత్తా.. నువ్వెప్పుడు వచ్చావ్, చూడనే లేదూ" అంటూ చిరునవ్వుతో పలకరించింది.

పద్మజ అక్కడికి దగ్గర్లో ఉండే ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది. ఆఫీసు నుండి తన ఇంటికి వెళ్ళే ముందు సాయంకాలాలు అపుడప్పుడు అన్నగారింట్లో కాసేపు కూర్చుని కాలక్షేపం చేసి వెళ్ళే అలవాటు ఉంది. ఆ రోజూ అలానే వచ్చింది.

పద్మజ రమ్య పక్కనే కుర్చీలో కూర్చుంటూ "మీరిద్దరూ ఇష్టపడి పెళ్ళి చేసుకున్న వాళ్ళే కదా, ఇంత తొందరగా ఎందుకు ఎడ మొహం, పెడమొహంగా అయ్యారో నాకర్థం కావటం లేదు" అంది.

పద్మజ వైపు చూస్తూ రమ్య నిట్టూర్చింది.." అదే నాకు ఆశ్చర్యంగా ఉందత్తా! పెళ్ళికి ముందు నన్ను చూడకుండా క్షణమైనా ఉండలేనంటూ కబుర్లు చెప్పిన జయంత్.. ఇప్పుడు చూడు... రోజుల తరబడి ఫోనులో అయినా మాట్లాడకుండా ఉండగలుగుతున్నాడు..!

పద్మజ చిరునవ్వుతో చూసింది "ప్రేమలో ఉన్నప్పుడు అలా అనిపించడం సహజమే కానీ.. నిజంగా ఎవరూ అలా ఉండలేరు. ఒకవేళ నిజంగా అలా ఉన్నా... మనమూ భరించలేం! వాస్తవాన్ని మనమూ అర్థం చేసుకోవాలి!

"నువ్వు ఫోను చేస్తున్నా, జయంత్ మాట్లాడటం లేదా..?"

"అతను తన పెద్దవాళ్ళకు సపోర్టుగా నిలబడి పంతంపట్టి నట్లుగా మాట్లాడకుంటే, 'నేనే ఎందుకు ఫోన్ చేయాలి? నాకు పౌరుషం ఉండదా?' చురుగ్గా చూస్తూ అంది రమ్య

పద్మజ మళ్ళీ చిరునవ్వు నవ్వింది. "ఈ సమస్య రెండు కుటుంబాలదే అయినా ముఖ్యమైన బాధితులు మాత్రం మీరిద్దరే. అందుకనే మీలో ఎవరో ఒకరు ముందడుగు వేస్తే తప్పేముందీ? వాళ్ళూ, వీళ్ళూ చెప్పే మాటలను పట్టించుకోవటం వల్లే చిన్న విషయం పెద్దదిగా అయిందని నాకనిపిస్తోంది.

ఈ మధ్య మా ఆఫీసులో జరిగిన విషయం ఒకటి చెప్పనా..? మా పై ఆఫీసరు శ్రద్ధగా పనిచేసే వాళ్ళని బాగా ప్రోత్సహిస్తారు. ఒకసారి ఆయన నా సీటు దగ్గరకు వచ్చి ప్రమోషన్ల లిస్టులో ఉన్న నేను తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పారు. నా చుట్టుపక్కల ఉన్నవాళ్ళు ఆయన అలా చెప్పటాన్ని తప్పు పట్టితే, ఆయన పట్ల నాకున్న గౌరవంకొద్దీ సమర్థించాను. అయితే వాళ్ళలో ఎవరో వారి మాటల్నే నావిగా ఆయనకు చేరవేసి, ఆయన నన్ను తప్పు చేసినట్లుగా మందలించారంటూ నాకు చెప్పారు.

ఎవరో ఒకరు నాకు సానుభూతి చూపిస్తున్నట్లుగా ఈ సమస్యను పెద్దదిగా చేయటం చిరాకు అనిపించి, మా ఆఫీసరుతో నాకు ఆయనపట్ల ఉన్న గౌరవాభిమానాలను ప్రస్తావిస్తూనే జరిగినదేమిటో వివరించాను. నేనలా సూటిగా మాట్లాడటం ఆయనకూ నచ్చింది. ఈ మధ్యలో కొంచెం బిగుసుకున్నట్లుగా ప్రవర్తించిన ఆయన మునుపటిలా మామూలుగా అవటం నాకూ సంతోషంగా అనిపించింది. ఒకరి దగ్గర్నుండి ఇంకొకరికి చేరే లోపల ఆ మాటల స్వరూప స్వభావం మారిపోతుండటం జరుగుతుంటుంది. అందుకే అపోహలూ, అపార్థాలు తొలగిపోవటానికి ముఖాముఖీ మాట్లాడు కోవటం వలన ప్రయోజనం ఉంటుందని నా ఉద్దేశ్యం. నేనే ఎందుకు అనుకోకుండా 'నేనే ముందు' అనుకుంటే తప్పేం లేదు! ముందడుగు వేయటం చిన్నతనం కానే కాదు, గొప్ప విషయమే కానీ! ఇలా ఆలోచించు. సరేనా? అంది పద్మజ.

"విడాకులనేవి ఆఖరి అస్త్రంగా మాత్రమే ఉపయోగపడాలి! నేను ఎన్నో రకాల హింసలను అనుభవించీ, సర్దుకుపోయే ప్రయత్నాలన్నీ విఫలమయ్యాకనే విడాకుల ఆలోచన చేశాను. వదిన నన్ను ఉదాహరణగా నీకు చూపించాలనుకుంటోంది, కానీ అది కరెక్టు కాదని నాకనిపిస్తోంది! అందుకే వదిన చెప్పమన్నది కాకుండా నాకు తోచింది చెబుతున్నాను. నువ్వు బాగా ఆలోచించి నీకు సరైనదనిపించే నిర్ణయం తీసుకో.." అంది పద్మజ.

పద్మజ ఒక నిముషం ఆగి మళ్ళీ చెప్పింది..జయంత్ హైదరాబాద్ హెడ్డాఫీసు నుండి ఈ ఊరి బ్రాంచికి ఒకటి రెండు సార్లు వస్తుంటాడని, అలా పరిచయం కలిగిందని చెప్పావు. రెండేళ్ళుగా అతనితో నీకు స్నేహం ఉంది. అతని స్వభావం, ప్రవర్తన పట్ల నీకే అవగాహన ఉంటుంది. అందుకే మీరిద్దరూ నేరుగా మాట్లాడుకుంటే సమస్య సద్దుమణుగుతుందని నాకనిపిస్తుంది. మీరిద్దరు ప్రేమతో ఒక్కటిగా నిలబడి పెద్దవాళ్ళని పెళ్ళికి ఒప్పించగలిగారు. పెళ్ళి కాగానే పెద్దవాళ్ళ అపోహలకు విడివిడిగా అయిపోయారు. ప్రేమ స్థానంలో ఇద్దరి మనస్సుల్లోనూ అహం చేరిందన్నమాట! పెళ్ళి తర్వాత కూడా ప్రేమను నిలుపుకోగలగాలి! అప్పటిలాగే ఇప్పుడూ పెద్దవాళ్ళ అపార్థాలను మీరిద్దరూ ఒక్కటిగా నిలబడి దూరం చేయండి! ఏమంటావు? అంది పద్మజ రమ్యతో..

పద్మజ మాటలకు ఆలోచనలో పడినట్లుగా తలూపింది రమ్య.

రమ్య గదిలో నుండి వచ్చిన పద్మజను ప్రభావతి కనుసైగలతోనే 'చెప్పావుగా'? అనడిగింది. అవునన్నట్లుగా తలవూపి పద్మజ, వెళ్ళొస్తానంటూ సెలవు తీసుకుంది.

ఆ రాత్రి రమ్య బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంది. జయంత్‌కి సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ పంపింది .... జయంత్ - పెళ్ళంటే.. నేను నుండి మనంలోకి మార్పు కదా! అలాంటిది ముందు ఒక్కటిగా ఉన్న మనం పెళ్ళి తర్వాత ఎందుకు విడివిడిగా మారిపోయాం? సమస్యల్ని ఎదుర్కోగలిగే నేర్పు ఎందుకు కొరవడింది? ఈ ఆలోచనలతో సతమతమవుతూ చివరకు నేనొక నిర్ణయానికి వచ్చాను.

మన రెండు కుటుంబాల మధ్య వచ్చిన అపార్థాలకు ఎవరిది తప్పు అనే ప్రశ్నను పూర్తిగా వదిలేద్దాం! జరిగిన విషయాలన్నింటినీ పూర్తిగా మరచిపోయి కొత్త జీవితాన్ని మొదలు పెడదాం! అందుకనే ముందుగా నేనే చేయి చాపుతున్నాను.

రేపు పెద్ద పండుగ.. నా పెళ్ళితో ఇంటికి పండుగ కళ లేకుండా పోయిందని పెద్దవాళ్ళు బాధపడుతున్నారు. ఆ బాధను నివారించాల్సిన బాధ్యత నాదేననుకుంటున్నాను. పండుగ అంటే సందడీ.. సంతోషమూ కదా! ఎవరి రాకతో మా ఇంటికి పండుగ వస్తుందో తెలుసు కదా? ఇక నిర్ణయం మీదే !

అలా మెసేజ్ పంపించాక తేలిక పడిన మనసుతో ప్రత్యుత్తరం కోసం చాలాసేపు మేలుకునే ఉన్న రమ్య ఎప్పటికో తెలియకుండానే నిద్రలోకి జారుకుంది.

వేకువ ఝామున మెసేజ్ వచ్చిన శబ్దానికి ఉలిక్కిపడి లేచి సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుంది రమ్య.. రమ్యా! - మన సమస్య పరిష్కారానికి ముందడుగు వేసి మనిద్దరిలో నువ్వే తెలివైన దానివని నిరూపించావు! అందుకే, నేనూ ఒక నిర్ణయం తీసుకున్నాను. 'ఇకనుండి ఎప్పుడూ నీ వెంటే నేను' అని! నా మనసులోని అలజడిని ఎదుర్కొనే మార్గంగా ఆఫీసు పనిని పెంచుకుని అక్కడే అర్ధరాత్రి వరకూ ఉండిపోతున్నాను. ఆ కారణంగానే నీ మెసేజ్‌ను చూసుకోవడంలో ఆలస్యం జరిగింది. చూడగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా బయలుదేరి పోయాను. నా కారు ఇప్పుడే మీ వూరు పొలిమేరలోనికి వచ్చేసింది కూడా! కాసేపట్లో నీ ముందు ఉంటాను. ఇక ఏకాంత శిశిరానికి స్వస్తి చెప్పి జంటగా వసంతానికి స్వాగతం పలుకుదాం!...

చదవటం పూర్తి చేసిన రమ్య, ఉరకలెత్తే ఉత్సాహంతో తల్లి గదిలోకి పరుగు పెట్టింది.

"పండగ పూట ఇంకా నిద్రపోతున్నావేమిటమ్మా.. లే.. నాన్న అప్పుడే వాకింగ్‌కి వెళ్ళారా! ఫోన్ చేసి తొందరగా వచ్చెయ్యమని చెప్పు.. మనింటికి పండగొస్తోంది" అంది రమ్య.

ప్రభావతి తెల్లమొహం వేసి చూస్తూ.. "పండగ రావటమేమిటే.. సరిగా చెప్పు" అంది.

"అబ్బా.. నీకన్నీ వివరంగా చెబితేనే కానీ అర్థం కాదు! కాసేపటిలో నీకే తెలుస్తుందిలే!"

ముసి ముసి నవ్వుతో కూతురు చెప్పిన మాటలకు ప్రభావతి విభ్రాంతిగా చూసింది ...